

# భవానీద్వీపం

-వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 33 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

పాఠకుడా! యింత కాలంగా ఉత్కంఠతో ఎదురుజూస్తున్న సమయం వచ్చింది. ఇక మనమధ్యనున్న మాయల తెర తొలిగిస్తాను. కొన్నిఘడియలే! ఈ కొద్దిసేపూ ఓపికపట్టు!

కృష్ణానది మీదినుండి చల్లని గాలులు వీస్తున్నాయి. ఇంద్రకీలాద్రి కూడా ఆ గాలులకు పులకింతలతో చల్లబడుతున్నది. కొండమీదనున్న వివిధజాతుల పూలు సువాసనల అలలు ఎగవేస్తున్నాయి. కృష్ణకు ఆవలి తీరాన మంగళగిరి స్వామి గాలిగోపురం మధ్య మధ్య కనువిందుజేస్తున్నది. ఒళ్ళు విరుచుకుంటున్న ముగ్ధలా మెరుస్తున్నది కృష్ణమ్మ. నైరుతి దిశలో ఎత్తుగా పెరిగిన వృక్షాలతో నడిమధ్యన కనిపిస్తున్నది భవానీ ద్వీపం. దట్టమైన పచ్చదనంతో కృష్ణమ్మ సిగముడిలా కనిపిస్తున్నది. ద్వీపం మీద చెట్లపైనుండి ఎగురుతున్న పక్షిజాతుల ధ్వనులు గాలివాలుకు ఆగి ఆగి వినిపిస్తున్నాయి.

పీఠంలాంటి విశాలమైన బండమీద కూర్చుని ఉన్నాడు సమర్థుడు. కొద్దిగా ఎడంగా ఉన్న శిలపై కూర్చుని సమర్థుని కథను మైమరచి వింటున్నాడు కృష్ణరాయలు. అల్లంత దూరంలో సమర్థునికి అభిముఖంగా చేతులు కట్టుకుని వింటున్నాడు బాలకృష్ణ స్వామి. శ్యామలవర్ణంలో సమ్మోహనంగా ఉన్నాడు. పాతిక చుట్టుపక్కలనే ఉంటుంది అతని వయసు. ఆ శరీర వర్ణం అతను ధరించిన కాషాయ దుస్తుల అందాన్ని యినుమడింప జేస్తున్నది. ఆ యువకుడు బందరు పీఠానికి బాధ్యుడు. త్రిలింగదేశములోని మరొక మహంతు. బాలకృష్ణస్వామిది ఒక ఆశ్చర్యకరమైన చరిత్ర.

భారతం చుట్టూ సముద్ర తీరంలోని ప్రతి ప్రధాన పట్టణంలోనూ సమర్థుడు తన పీఠాలను స్థాపించి మహంతులను నియమించాడు వాటి నిర్వహణకు. బందరును సందర్శించినప్పుడు అక్కడ మహాబలి మందిర స్థాపనచేసి, ఒక మఠాన్ని నెలకొల్పాడు.

అప్పుడు దక్షిణభారత యాత్రలో వున్న సమర్థుడు మహాలయ అమావాస్యకు బందరు సముద్రానికి వచ్చాడు. సముద్రంలోకి లాక్కుపోతున్న అలలనుండి ముగ్గురు తీర్థయాత్రికులను తనొక్కడే కాపాడాడు ఒక యువకుడు. సముద్రపు అలలతో పోరాటంలో మరణపు అంచులకు వెళ్లిన అతడిని సమర్థుడు రక్షించి ఒడ్డుకు చేర్చాడు. పంచముడని చూడకుండా అతడిని అక్కున చేర్చుకున్నాడు. శిష్యుడిని చేసుకుని నెలరోజులు దీక్షనిచ్చాడు. త్రయోదశాక్షరీ మంత్రాన్ని ఉపదేశించాడు. బందరు పీఠ బాధ్యతను అప్పగించాడు. బందరునుండి అతనితోపాటు వచ్చిన మరొక యిద్దరు సన్యాసులు యిప్పుడు అతని ప్రక్కన వున్నారు.

వారికి కొద్దిదూరంలో గోల్కొండ నిజాము ప్రతినిధులుగా వచ్చిన సైనికులున్నారు. వారు సమర్థుని రక్షణకోసం పంపబడ్డారు. సమర్థుడు నిజాము అతిథి, త్వరలో ఛత్రపతి హైదరాబాద్ సందర్శనకు వస్తున్నాడు కూడా. కొండ పాదంనుండి నూటయాభై అడుగుల ఎత్తు పెరిగిన విశాలమైన పొగడ చెట్టు నీడన సైనికులగుఱ్ఱాలు సేద దీరుతున్నాయి. కొద్దిదూరంలో మొఘలు పాలకుల సైనికబృందం ఉన్నది. వారు మొఘలు ప్రభువుల తరపున సమర్థునికి ఆతిథ్యం యిచ్చి దుర్గమ్మ దర్శనానికి తోడుకొని వచ్చారు. మొఘలులకు ఒక సన్యాసి దుర్గమ్మను సందర్శించుకొనడానికి వచ్చాడని మాత్రమే తెలుసు. ఆ సన్యాసి నిజాము ప్రభువుల అతిథి అని మాత్రమే తెలుసు.

బ్రాహ్మీ ముహూర్తంలో కాలినడకన బయలుదేరాడు సమర్థుడు. కృష్ణరాయలు, అతని నలుగురు అంగరక్షకులు వెంట నడిచారు. అపరాహ్ణ వేళకు మహానివేదన సమయానికి అమ్మవారి సన్నిధికి చేరుకున్నారు. అమ్మను దర్శించుకుని 'పంక్తి కంఠన్'తో తన పరిచయ గాథను వివరించడం దలుబెట్టాడు. మర్మకళా విద్యార్థిగా తన అనుభవ గాథలను రోమాంచితంగా వివరించాడు కృష్ణరాయలకు.

'ఇది ఋషి సంప్రదాయం కృష్ణోబా! నిత్యచైతన్య శీలురైన భారతీయ ఋషుల విధానం. అనుకున్న పని ముగిసిన తరువాత వెళ్ళినచోట వుండకూడదు. కాలము కర్పూరంలా కరిగిపోతుంది కృష్ణోబా! కాలాయాపన చేయకూడదు' అన్నాడు సమర్థుడు. చిన్న నవ్వు నవ్వి ' విశ్వామిత్రుడంతటి వాడే రఘువీరుడితో పని ముగిసిన తరువాత మళ్ళీ కనబడకుండా పోలేదూ?' అన్నాడు.

కృష్ణరాయలు అవునన్నట్టు తలపంకించాడు కానీ అతని మనసులో కుతూహలం తొలిగిపోలేదు. మహా సర్పాలభయానక గాథ వినడంతో ఆ తరువాత ఏమైందీ తెలుసుకోవాలని మనసులో వున్నది.

కొంతసేపు మౌనం వహించి మొదలుబెట్టాడు సమర్థుడు. 'నెలరోజులకు పూర్తిగా తేరుకున్నారు పంక్తికంఠన్, అగస్త్య పెరియాసన్. మిగిలిన శిష్యుల వలన దీని చూపులకు అలౌకికమైన శక్తి వచ్చిందని గ్రహించాడు పెరియాసన్' అన్నాడు తన ఛాతీమీద చూపుడువేలితో స్పృశిస్తూ.

చిరునవ్వుతో మరలా కొనసాగించాడు సమర్థుడు. ' ఏకాంతంలో వీడిని తరచి తరచి ప్రశ్నించి, వీడుసందర్శించిన గరుడ మూర్తి గురించి, ఆ అనుభవాన్ని గురించి తెలుసుకున్నాడు. సంప్రదాయం కొరకు అత్యంత రహస్యమైన నూకువర్మ కళను నెలరోజులపాటు బోధించాడు. కృష్ణోబా! నూకువర్మ కళతో కేవలం చూపులతో మదపుటేనుగులను, సింహాలను కూడా లొంగదీసుకోవచ్చు, సంహరించవచ్చు' అన్నాడు. కృష్ణరాయలు శ్వాస తీసుకోవడం మరిచినట్లు వింటున్నాడు.

' తాను స్వయంగా పరీక్షించి, వీడిని పెరియాసన్ గా ప్రకటించాడు. వీడు వీడుకోలు తీసుకుంటూ, గురుదక్షిణ స్వీకరించవలసిందే అని పట్టుబడితే పంచముఖ హనుమత్కవచ మంత్రాన్ని కోరాడాయన! ' అని ఆగిపోయాడు. ఆయన కనులలో పల్చని నీటి తెర, ఆనందానికి సూచనగా. తన గురువుకు తాను గురువై సుందర గురుమూర్తి కవచాన్ని ఉపదేశించిన దృశ్యం ఆయన కనులముందు మెదిలింది. శరీరం పులకలెత్తింది.

' వెళ్లిన లక్ష్యం సిద్ధించింది. వెంటనే వెనుకకు మరలాను కృష్ణోబా! మహంతుల ద్వారా పంక్తికంఠన్ వార్తలు తెలుస్తూనే వుండేవి. ఆ తరువాత ఒక సంవత్సరానికి పంక్తి కంఠన్ పెరియాసన్ గా అర్హతను సాధించాడని విన్నాను. మరొక రెండు సంవత్సరాలకు నూటపాతిక సంవత్సరాల వయసులో అగస్త్య పెరియాసన్ శరీరాన్ని వదిలిపెట్టాడు '

' అడగకుండా వుండలేక పోతున్నాను స్వామీ..' అని సంశయంతో ఆగిపోయాడు కృష్ణరాయలు. తనకు తెలుసు అన్నట్లుగా నవ్వాడు సమర్థుడు. ' తమిళులలో రావణుడిని ఆరాధించేవారు వున్నారు కృష్ణోబా. వారు రాముడిని, రామదాసులను శత్రువులుగా చూస్తారు. పంక్తి కంఠన్ అటువంటివాడే. అందుకే నీలకంఠన్ అని తల్లిదండ్రులు పెట్టినపేరును రావణుడి పేరున పంక్తికంఠన్ అని మార్చుకున్నాడు. వీడు రామదాసుడని మొదటిసారి చూసినపుడే గ్రహించాడు. ద్వేషం పెంచుకున్నాడు. పెరియాసన్ వీడిని అభిమానించడంతో అసూయ పెరిగింది అతడికి '

' అరిషడ్వర్గాలలో అన్నిటికన్నా అసూయ ప్రమాదకరమైనది కృష్ణోబా! భార్యా భర్తల మధ్య, బయటివారి పైనా అసూయ కలుగుతుంది. కన్నవారి పైనా కానివారిపైనా అసూయ కలుగుతుంది. శత్రువులమీదే కాదు, స్నేహితులపైనా కలుగుతుంది. గురు శిష్యుల మధ్యా కలుగుతుంది! ప్రపంచంలోని ఏ బంధమూ అసూయకు అతీతం కాదు. అసూయను జయించినవాడు మరణాన్ని జయించినవాడితో సమానుడు కృష్ణోబా! అసూయతో వీడిని అంతం చేయాలనుకున్నాడు పంక్తికంఠన్ '

' ముందు వీడిని, ఆ తరువాత శివబానూ అంతం చేయడానికి ఒక మహావీరుడి వేటలో పడ్డారు గోల్కొండ అంతఃపుర బానిసలు. ఆ తరువాత అక్కన్న మాదన్నల అడ్డు తొలిగించుకోవాలని ఆలోచన. అన్వేషణలో పంక్తికంఠన్ జాడ పట్టుకున్నారు. వీడి కోసం అనగానే పంక్తికంఠన్ పరుగున వచ్చాడు. దుష్టుడిలో మార్పు దూరపుకొండల నునుపు వంటిది కృష్ణోబా! రఘువీరుడి కరుణతో బతికి బయటపడ్డ సంగతినీ మరిచిపోయాడు ' అని, సందేహం తీరిందా అన్నట్టు చూశాడు కృష్ణరాయలను.

మరేదో అడగబోయిన కృష్ణరాయలను చిరునవ్వుతోనే వారిస్తూ ఎడమచేతిని సాచి దూరంగా చూపించాడు. కృష్ణమ్మ అలల మధ్య వూయలలూగుతున్న ద్వీపాన్ని చూపిస్తూ ' భవానీ ద్వీపం పిలుస్తోంది కృష్ణోబా! మరెన్నో రహస్యాలు రమ్మంటున్నాయి నిన్ను. యింకెన్నో సందేహాలు కమ్ముకుంటాయి నిన్ను. అన్నీ యిక్కడేనా? యిప్పుడేనా? కొన్నిటిని అక్కడికి దాచుకో! ఎన్నిటినో అక్కడ నీకోసం దాచాను నేను ' అన్నాడు.

తలతిప్పి చూశాడు కృష్ణరాయలు. ప్రొద్దు వాలుతున్నది. ఆకాశంనుండి లేత వంగపండురంగు పట్టుచీరను లాక్కుని కట్టినట్లుంది కృష్ణమ్మ. అంచుల్లాగా ద్వీపపు అంచుల్లో మెరిసిపోతున్నది కృష్ణమ్మ నీరు. ఒళ్ళు విరుచుకున్న కృష్ణమ్మ పైట తొలిగిందేమో, వక్ష స్థలంలా ఎత్తుగా కనిపిస్తున్నది ద్వీపం. వంగపండురంగు ఆకాశంలో లేత నీలిరంగు మేఘాలు రకరకాల ఆకారాలు మార్చుకుంటూ సాగిపోతున్నాయి ఎక్కడికో!

ఒక మేఘం జుట్టు విరబోసుకుని గంతులేస్తున్న పిల్లలా కనిపించింది. అంతలోనే పీచులాసాగి గడ్డంతో ఎవరో యోగిలా కనిపించింది. అంతలోనే పూర్తిగా సాగి పలుచబడి నాటు తుపాకీలా కనిపించింది. ఇంతలోనే కొస విచ్చుకుని, గాలికి పైకిలేచి, పడగ విప్పుకున్న పెద్ద పాములా కనిపించింది.

' ఎన్నెన్ని ఆకృతులు! ఎన్ని వికృతులు! చూడగలిగే కనులుంటే ఎన్ని చూడవచ్చు! వెళ్లి చూద్దాం పద. భవానీ ద్వీపం చూపెడుతుంది ' అన్నాడు సమర్థుడు. ఆయన కంఠంలో ప్రశాంతమైన గాంభీర్యం ధ్వనించింది. తమకై ఎదురుచూస్తున్న వారికి పదమన్నట్లు సూచన చేసి ముందుకు అడుగులేశాడు కృష్ణరాయలు.

'జయ జయ రఘువీర సమర్థా! జై భవానీ' అని నినదిస్తూ కదిలాడు సమర్థరాముడు.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS